RNI No: APTEL /25/A2860

సీమ వార్త
# సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 35 | పేజీలు : 4 | గురువారం 6 ఆగస్టు 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



## పోలవరం-బనకచర్లకు
# కేంద్రం బ్రేక్

- ఏపీ ప్రతిపాదన వెనక్కి
- పర్యావరణ ప్రతిపాదనను వెనక్కి పంపిన కేంద్రం
- ఈఏసీ నివేదికల ఆధారంగా నిర్ణయం
- ట్రిబ్యునల్ తీర్పుపై అభ్యంతరాలు
- పొరుగు రాష్ట్రాల ఆందోళనలను గుర్తుచేసిన కేంద్రం
- సీడబ్ల్యూసీ అనుమతులు తప్పనిసరి సూచన
- వివాదాల తర్వాతే కొత్త దరఖాస్తు పంపాలని హితవు



## రైతుల కోసం కేంద్రం
# రూ.23,731 కోట్ల 'గోబర్ధన్' పథకం

- పథకానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- పశువుల పేడ, వ్యవసాయ వ్యర్థాలకు పెరగనున్న డిమాండ్
- సీబీజీ ఉత్పత్తిని పది రెట్లు పెంచే లక్ష్యం
- సీబీజీకి ప్రభుత్వం మద్దతుతో స్థిర ధర
- కొత్త బయోగ్యాస్ ప్లాంట్లకు రూ.2 కోట్ల వరకు సాయం
- గ్రామీణ ఉపాధి, పెట్టుబడులకు ఊతం

## వైసీపీ దుష్ప్రచారాన్ని
# తిప్పికొట్టాలి



- వైసీపీ అరాచకాలకు చెక్ పెట్టడానికి రెండు నిమిషాలు చాలు
- రాజకీయం ముసుగులో జగన్ నేరాలకు పాల్పడుతున్నారు
- డీఎస్సీపై వైసీపీ శ్రేణులు కావాలనే వివాదాలు సృష్టిస్తున్నారు
- గంజాయి బ్యాచ్‌ను జెన్ జీ అని చెప్పుకోవడం గొడ్డలి పార్టీకే చెల్లింది

**అమరావతి**

తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో జగన్ పర్యటన సందర్భంగా వైకాపా కార్యకర్తలు పరిధి దాటి ప్రవర్తించారని సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పొగాకు బేళ్లను తొక్కి నాశనం చేసి పరామర్శ ముసుగు తగిలించుకున్నారని విమర్శించారు. క్యాబినెట్ భేటీ అనంతరం మంత్రులతో సీఎం మాట్లాడారు. "దేవరపల్లిలో వైకాపా శ్రేణులు ఓ మహిళా చిరువ్యాపారి పొట్టగొట్టారు. రాజకీయ పార్టీల ముసుగులో క్రిమినల్స్ తయారవుతు న్నారు. గంజాయి బ్యాచ్‌ను జెన్ జీ అని చెప్పుకోవడం గొడ్డలి పార్టీకే చెల్లింది. ఆక్వా ఫీడ్ ఎగుమతులను 50 శాతం తగ్గించేందుకు కేంద్రం సానుకూలంగా ఉంది. పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించామనే అసూయతో వైకాపా కుట్రలు చేస్తోంది. డీఎస్సీపై కేసులను కొట్టేసి.. - మిగతా 3లో



### విద్యార్థులతో రాహుల్ గాంధీ సభకు అనుమతి రద్దు

- యూపీలో రాజకీయ దుమారం
- విద్యార్థులతో రాహుల్ సభకు అనుమతి నిరాకరణ
- ప్రయాగ్‌రాజ్‌లో రాజకీయ వివాదం
- వర్షాలు, భద్రత కారణమని వివరణ
- బీజేపీపై కాంగ్రెస్ ఆరోపణలు
- భయపడే అనుమతులివ్వడం లేదని వ్యాఖ్య
- నిర్ణయాన్ని తప్పుబట్టిన విపక్షాలు

# పరామర్శల పేరుతో బలప్రదర్శన ఎందుకు?

- జగన్‌పై మంత్రి అనిత విమర్శలు
- పరామర్శల పేరుతో బలప్రదర్శన చేస్తున్నారని ఆరోపణ
- నిందితులను పరామర్శిస్తున్నారని విమర్శ
- జగన్ పర్యటనల వీడియోలు ప్రదర్శించిన అనిత
- అంబులెన్స్‌కు దారి ఇవ్వలేదని వైకాపాపై ఆరోపణ
- పరామర్శల వల్ల ముగ్గురు చనిపోయారని ఆరోపణ
- ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్న




**అమరావతి**

వైఎస్‌ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరామర్శల పేరిట బలప్రదర్శన చేస్తున్నారని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. ఆయన బయట అడుగు పెడితే విధ్వంసం, అరాచకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి చర్యలతో ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో అనిత మాట్లాడారు. బాధితులను కాకుండా నిందితులను పరామర్శించడం ఏంటని జగన్‌ను నిలదీశారు. ఆయన పర్యటనల్లో చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించిన వీడియోలను మీడియాకు ప్రదర్శించారు. "వైకాపా నేతలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. బెట్టింగ్‌లో - మిగతా 3లో

# హైదరాబాద్‌లో పది లక్షల మంది ఓటర్లు గల్లంతు!

మొత్తం ఓటర్లలో ఇది 21 శాతం. వీరిలో కొందరు మరణించిన వారున్నప్పటికీ మిగతా వారు ఎక్కడ ఉన్నారో, ఏమయ్యారో వివరాలు లభించలేదు



**హైదరాబాద్**

హైదరాబాద్ జిల్లాలో దాదాపు పది లక్షల మంది ఓటర్లు గల్లంతయ్యారు. జిల్లాలోని మొత్తం ఓటర్లు 47,36,669 మందిలో 9,95,315 మంది ఓటర్లు ఏమైపోయారో అధికారులకు అంతు చిక్కలేదు. మొత్తం ఓటర్లలో ఇది 21 శాతం. వీరిలో కొందరు మరణించిన వారున్నప్పటికీ మిగతా వారు ఎక్కడ ఉన్నారో, ఏమయ్యారో వివరాలు లభించలేదు. వీరు ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉండవచ్చునని, లేదా ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి - మిగతా 3లో

## డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్

- విశాఖపై ప్రపంచ దిగ్గజాల చూపు.. విశాఖపై పెరుగుతున్న పెట్టుబడిదారుల ఆసక్తి
- నైట్ ఫ్రాంక్ నివేదికలో ముంబయికి ప్రపంచ టాప్-15లో చోటు
- హైదరాబాద్‌కు భారీ ప్రాజెక్టుల వరుస.. విశాఖలో గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల అవకాశాలు
- క్లౌడ్, ఏఐతో పెరుగుతున్న డిమాండ్.. భారత్‌కు బలపడుతున్న గ్లోబల్ గుర్తింపు





### రేవంత్ రెడ్డి ఒక్కసారి కూడా 'జై తెలంగాణ' అనలేదు

- తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్నారన్న హరీశ్
- కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ వచ్చిందని వ్యాఖ్య
- గోదావరి జలాల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపాటు

## తెల్ల రేషన్ కార్డుల పంపిణీకి
# ముహూర్తం



- ఆగస్టు 15న రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ
- సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- అన్ని నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమం
- డెబిట్ కార్డు సైజులో బార్‌కోడ్‌తో రానున్న కొత్త కార్డులు

**హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్క రించుకుని ఆగస్టు 15న కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్ర మాన్ని అధికారికంగా ప్రారంభించనుంది. సంగారెడ్డి వేదికగా జరగనున్న రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పంపిణీని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం వివరాలను నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబం ధించిన షెడ్యూల్‌ను ముఖ్యమంత్రి ఇప్పటికే - మిగతా 3లో

గురువారం 6 ఆగస్టు 2026

సీమ వార్త

# సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

## వందేమాతరం 150 ఏళ్ల సంబరాలతో..... హర్ ఘర్ తిరంగా..!!

**.....ఆగస్టు 9 నుండి 17 వరకు జిల్లా వ్యాప్తంగా "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాలు.**

**పుట్టపర్తిలో...జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**

**పుట్టపర్తి, ఆగస్టు 6: సీమ వార్త సాయంత్రం.**



భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "హర్ ఘర్ తిరంగా -- 2026" కార్యక్రమాన్ని, అలాగే "వందే మాతరం" గీతం ఆవిర్భావానికి 150 సంవత్సరాల సంబరాలను పురస్కరించుకుని శ్రీ సత్యసాయి జిల్లాలో ఆగస్టు 9 నుండి 17 వరకు విస్తృత స్థాయిలో దేశభక్తి కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమాల్లో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయడంతో పాటు ప్రజల్లో దేశభక్తి, జాతీయ ఐక్యత, జాతీయ పతాకం పట్ల గౌరవాన్ని పెంపొందించేలా పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.జిల్లాలో తిరంగా ర్యాలీలు, బైక్, సైకిల్, ఈ-బైక్ ర్యాలీలు, దేశభక్తి సాంస్కృతిక కార్యక్రమాలు, వందే మాతరం సామూహిక గానం, "సెల్ఫీ విత్ తిరంగా" ప్రచారం, తిరంగా ప్రదర్శనలు, ప్రభుత్వ భవనాలకు త్రివర్ణ విద్యుత్ దీపాలంకరణ, భారీ రంగవల్లుల కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.జాతీయ పతాకాల లభ్యత కోసం స్వయం సహాయక సంఘాలు, స్థానిక తయారీదారుల ద్వారా ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా నిబంధనలకు అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.అదేవిధంగా ఆగస్టు 14న "విభజన భీభత్స స్మృతి దినం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విభజన సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళు లర్పిస్తూ ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు, విద్యాసంస్థల్లో ప్రత్యేక సమావేశాలు, డాక్యుమెంటరీ ప్రదర్శనలు, ఉపన్యాసాలు, చర్చా కార్యక్రమాలు మరియు రెండు నిమిషాల మౌన నివాళి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, విద్యాసంస్థలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.జిల్లా ప్రజలందరూ తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి, నిర్వహించే కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

# లక్షలాది మంది.... నిరుద్యోగులకు నిరాశే!

**.....డీఎస్సీ అక్రమాలపై ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష.**

**.... ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం డిఎస్సీ.**

**..... యువతను ఆశతో నిలబెట్టి... చివరకు అనిచ్చితి లోకి నెట్టారు.**

**..... విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు వద్దు.**

**.... పరిగిలో నిరుద్యోగ యువతకు మద్దతుగా... మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ నిరసన.**






**పరిగి ఆగస్టు 6 సీమ వార్త సాయంత్రం.**

డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలకు నిరసనగా శ్రీ సత్యసాయి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో పరిగి మండల కేంద్రంలోని పరిగి మేజర్ పంచాయతీ వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ చేసిన ప్రధాన డిమాండ్ చేశారు. ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటమాడిన ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని పేర్కొన్నారు. - మిగతా3లో

## ప్రజల్లోకి...బాలికే భవిష్యత్తు..!!

**.....జిల్లాస్థాయి "బాలికే భవిష్యత్తు" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**

**పుట్టపర్తిలో...జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్**

**పుట్టపర్తి, ఆగస్టు 06: సీమ వార్తా సాయంత్రం.**



బాలికల విద్య, సాధికారత, వ్యక్తిత్వ వికాసం మరియు ఉన్నత కెరీర్ అవకాశాలపై సంపూర్ణ అవగాహన కల్పించే లక్ష్యంతో చేపడుతున్న జిల్లాస్థాయి "బాలికే భవిష్యత్తు" కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో దిగ్విజయం చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.గురువారం ఉదయం కలెక్టరేట్ లోని మినీ కన్ఫారెన్స్ హాలు నందు ఈ కార్యక్రమ నిర్వహణ సన్నాహాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూనాణ్యమైన విద్యతో పాటు బాలికలలో ఆత్మవిశ్వాసాన్ని నింపడం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, మానసిక దృఢత్వం మరియు భవిష్యత్ ఉపాధి కెరీర్ అవకాశాలపై సమగ్ర అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం.మహిళా శిశు సంక్షేమం, విద్య, వైద్యారోగ్య, సంక్షేమ శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేసి ఈ కార్యక్రమాన్ని మోడల్‌గా నిర్వహించాలి. ప్రముఖ సైకాలజిస్ట్ సుధీర్ సంద్ర ముఖ్య వక్తగా హాజరై విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసం, లక్ష్య సాధన, ఒత్తిడి నిర్వహణ, కెరీర్ ప్లానింగ్ మరియు ప్రేరణాత్మక అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పిస్తారు. ఈ జిల్లాస్థాయి "బాలికే భవిష్యత్తు" కార్యక్రమం 11-08-2026 తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ ఽ సాధికారత శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ (ఐసీడీఎస్) ప్రమీల తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో సువర్ణ ఆర్డీఓ,ప్రమీల ప్రాజెక్టు డైరెక్టర్, మహిళా ఽ శిశు సంక్షేమ శాఖ,కిష్టప్ప -- జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఫిరోజ్ బేగం -- జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి ,ఐడపిఆర్ ఎడి భరత్ కుమార్ రెడ్డి,మహేష్ -- జిల్లా బాలల పరిరక్షణ అధికారి ,జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రామ్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజేంద్ర కుమార్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి చెన్నకేశవ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నిమ్మల శ్రీధర్... కంటితో చూశాడు.. చేతితో సాయం అందించాడు.

**.... టిడిపి డోర్ టు డోర్ ప్రోగ్రాంలో మంచాన పడ్డ అభాగ్యునికి ఆర్థిక సాయం.**

**... పట్టణ వాసులపై అనునిత్యం స్పందిస్తున్న... టిడిపి నేత నిమ్మల శ్రీధర్.**

**గోరంట్ల ఆగస్టు 6 సీమ వార్త సాయంత్రం.**




అభాగ్యుల ఆక్రందన చూడగానే ఆ టి డి పి నేతకు మనసు చలించి మానవత్వం పరిమళించి మంచానపడ్డ ఒక అభాగ్యునికి వైద్య పరీక్షలు నిమిత్తం తన వంతు సాయి మందించేందుకు ముందుకు వచ్చి కంటితో చూసిన తక్షణమే అక్కడికక్కడే సాయం అందించి అందరి మనసు దోచుకున్నాడు తెలుగుదేశం పార్టీ మండల నేత, గోల్డ్ షాప్ యజమాని గోరంట్ల పట్టణానికి చెందిన నిమ్మల శ్రీధర్. గోరంట్ల పట్టణంలోని నాలుగో వార్డు పులేరు రోడ్డులో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్న సందర్భంలో ఆ ప్రాంతానికి చెందిన ఒక అభాగ్య కుటుంబం ముద్ద రాసప్ప గారి ఆంజనేయులు గత కొంత కాలంగా అనారోగ్యానికి గురి మంచాన పడి దీర్ఘకాలిక చికిత్సలు చేయించుకుంటున్న నేపథ్యంలో ప్రచారానికి వచ్చిన టిడిపి నేత నిమ్మల శ్రీధర్ ఆ అభాగ్యుని చూసి మనసు చలించి అక్కడికక్కడే ఆర్థిక సాయం అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపల్లి నరేష్ యాదవ్, సింగిరెడ్డిపల్లి శ్రీకాంత్, కురుబ మహేంద్ర, దాదు, డీలర్ రమేష్, మల్లేష్, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అనంత కోసం.... ఢిల్లీ గడ్డలో అంబికా వాణి..!!

**.....అనంతపురంలో జాతీయ హార్టికల్చర్ సంస్థలు ఏర్పాటు చేయాలిలి**

**.....కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు....ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ వినతి**

**అనంతపురం (న్యూఢిల్లీ,) ఆగస్టు 06 : సీమ వార్తా సాయంత్రం.**



-అనంతపురం జిల్లాను దేశంలోనే ప్రముఖ హార్టికల్చర్ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కీలక చర్యలు తీసుకోవాలని కేంద్ర వ్యవసాయ ఽ రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కి అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ వినతిపత్రం సమర్పించారు.అనంతపురం జిల్లాలో జాతీయ స్థాయి హార్టికల్చర్ సంస్థలు, పరిశోధన కేంద్రాలు, మార్కెటింగ్ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. అనంతపురం జిల్లా ప్రస్తుతం "ఆంధ్రప్రదేశ్ ఫ్రూట్ బౌల్"గా పేరుగాంచిందన్నారు. జిల్లాలో సుమారు 1,21,761 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతుండగా, ఏటా 32.63 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు. అరటి, దానిమ్మ, బత్తాయి, నారింజ, బొప్పాయి, జామ, సపోటా వంటి పండ్ల ఉత్పత్తిలో జిల్లా రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుస్తోందని కేంద్ర మంత్రి గారికి వివరించారు. వరుస కరువుల కారణంగా వేరుశెనగ సాగు తగ్గినప్పటికీ రైతులు ఉద్యాన పంటల వైపు మళ్లి తమ ఆదాయాన్ని పెంచుకున్నారని పేర్కొన్నారు. అనంతపురం రైతులు ప్రస్తుతం 26 రకాల పండ్ల పంటలు, 29 రకాల కూరగాయలు, 8 రకాల సుగంధ ద్రవ్యాలు, 7 రకాల తోటల పంటలు, 10 రకాల పూల పంటలు, 5 రకాల ఔషధ మొక్కలు సాగు చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా అవకాడో, లీచీ, మకాడామియా, నాన్-చిల్లింగ్ ఆపిల్ వంటి విదేశీ పంటలను కూడా విజయవంతంగా సాగు చేస్తూ ఆధునిక వ్యవసాయ సాంకేతికతను స్వీకరిస్తున్నారని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రాయలసీమ హార్టికల్చర్ హబ్ కార్యక్రమం ద్వారా వచ్చే మూడు సంవత్సరాల్లో అనంతపురం జిల్లాలో మరో 90 వేల హెక్టార్లలో ఉద్యాన పంటల సాగు విస్తరించనుందని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.40,000 కోట్లతో పాటు కేంద్రం నుంచి రూ.60,000 కోట్ల సహకారం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు రాయలసీమను దేశంలోనే అతిపెద్ద ఉద్యాన కేంద్రంగా మార్చే సామర్థ్యం కలిగి ఉందన్నారు.ఈ నేపథ్యంలో రైతులకు మరింత ప్రయోజనం చేకూరేలా కేంద్ర ప్రభుత్వం అనంతపురంలో నాలుగు కీలక సంస్థలను ఏర్పాటు చేయాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. రైతులకు సాంకేతిక మార్గదర్శకత్వం, నాణ్యమైన నాట్ల సరఫరా, పంట అనంతర మౌలిక వసతులు, మార్కెటింగ్ అనుసంధానం, ఆర్థిక సహాయం అందించేందుకు అవసరమని సూచించారు.

**జాతీయ హార్టికల్చర్ శిక్షణ కేంద్రం :**

- లిఆధునిక సాగు పద్ధతులు, నాణ్యమైన ఉత్పత్తి, పంట అనంతర నిర్వహణ, ఎగుమతి ప్రమాణాలపై రైతులు, యువ పారిశ్రామికవేత్తలు, వ్యవసాయ విస్తరణ అధికారులకు శిక్షణ అందించేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

**ప్రాంతీయ సిట్రస్ పరిశోధన కేంద్రం :**

అనంతపురంలో సుమారు 38 వేల హెక్టార్లలో బత్తాయి సాగు జరుగుతున్న నేపథ్యంలో వైరస్ రహిత నాణ్యమైన నాట్లు, పరిశోధన, ధృవీకరించిన బడ్‌వుడ్ సరఫరా కోసం ప్రత్యేక పరిశోధన కేంద్రం అవసరమని వివరించారు.

**4. టెర్మినల్ మార్కెటింగ్ ఫెసిలిటీ :**

గ్రేడింగ్, సార్టింగ్, ప్యాకేజింగ్, కోల్డ్ స్టోరేజ్, రైపెనింగ్, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి సమగ్ర సదుపాయాలతో కూడిన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే పంట అనంతర నష్టాలు తగ్గడంతో పాటు రైతులకు గిట్టుబాటు ధర లభించి ఎగుమతులు పెరుగుతాయని తెలిపారు.ఈ నాలుగు కేంద్రాల ఏర్పాటు వల్ల అనంతపురం జిల్లాతో పాటు మొత్తం రాయలసీమ హార్టికల్చర్ రంగం దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు పొందుతుందని, రైతుల ఆదాయం పెరగడం, గ్రామీణ ఉపాధి అవకాశాలు విస్తరించడం, ఎగుమతులు పెరగడం, సుస్థిర వ్యవసాయాభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు.ఈ నేపథ్యంలో రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గారిని ఎంపీ అంబికా కోరారు.

సీమ వార్త సాయంకాలం
గురువారం
6 ఆగస్టు 2026

## లక్షలాది మంది.... నిరుద్యోగులకు నిరాశే..!!

-మొదటిపేజీ తరువాయి

ఉద్యోగాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి, నేడు యువత ఆశలను అణిచివేస్తున్న ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.డీఎస్సీ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆగదన్నారు.డీఎస్సీ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలి.మీడియాతో ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూడీఎస్సీ నియామకాల ప్రక్రియపై వెలువడుతున్న ఆరోపణలు, పారదర్శకతపై వ్యక్తమవుతున్న సందేహాలు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది నిరుద్యోగ యువతలో తీవ్ర ఆందోళన నెలకొల్పాయన్నారు. ఉద్యోగం కోసం సంవత్సరాల తరబడి కష్టపడి చదివిన అభ్యర్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.ఎన్నికల సమయంలో ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, పారదర్శక నియామకాలు అంటూ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. యువతను ఆశలతో నిలబెట్టి, చివరకు అనిశ్చితిలోకి నెట్టడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అన్నారు.డీఎస్సీ వ్యవహారంపై సమగ్ర, పారదర్శక విచారణ జరిపి నిజానిజాలను ప్రజల ముందుంచాలని, బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన నెలకు ?3,000 నిరుద్యోగ భృతి హామీని వెంటనే అమలు చేయాలని, విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పారదర్శకంగా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.నిరుద్యోగ యువత, విద్యార్థుల భవిష్యత్తుతో ఎవ్వరూ రాజకీయాలు చేయొద్దని హెచ్చరించారు. యువతకు న్యాయం జరిగే వరకు, డీఎస్సీ వ్యవహారంపై పూర్తి స్పష్టత వచ్చే వరకు, ఎన్నికల హామీలన్నీ అమలయ్యే వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు మరింత ఉధృతంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

ఈ రిలే నిరాహార దీక్షలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ సంఘీభావాన్ని తెలియజేశారు

## రూ “88.10 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ



**సోమందేపల్లి ఆగష్టు 6 సీమ వార్త సాయంకాలం** గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా జల్ జీవన్ మిషన్ పథకాన్ని అమలు చేస్తున్నాయని ఎన్డీయే కూటమి నాయకులు తెలిపారు. మండల కేంద్రంలోని పురాతన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వెనుక వైపు రూ “88.10 లక్షల వ్యయంతో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు గురువారం ఎన్డీఏ కూటమి నాయకులు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామంలో ప్రజల తాగునీటి ఎద్దడిని మంత్రి సవితమ్మకు దృష్టికి తీసుకెళ్లగా ఆమె తక్షణమే స్పందించి రెండు ఓవర్ హెడ్ ట్యాంకులను మంజూరు చేశారని వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.జరిగినది. జల్ జీవన్ మిషన్ పథకం ముఖ్య లక్షణాలు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షితమైన తాగునీరుని అందించడం, నాణ్యమైన నీరు సరఫరా అయ్యే నీరు తాగునీటికి తగిన నాణ్యతా ప్రమాణాలతో ఉండేలా చూసేందుకు పరీక్షలు నిర్వహించడం. పాఠశాలలు, అంగన్‌వాడీలు గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సురక్షితమైన నీటి సరఫరా కల్పించడం ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమములో ఎంపీడీఓ వెంకటలక్ష్మి,రాష్ట్ర సగర ఉప్పర కార్పొరేషన్ ఛైర్మన్ రంగేపల్లి వెంకటరమణ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డి.వి ఆంజనేయులు,మండల కన్వీనర్ నడిమిపల్లి వెంకటేష్, ఫైవ్ మ్యాన్ కమిటీ సభ్యులు నీరుగంటి చంద్ర, సిద్ధలింగప్ప, చాలకూరు భానుకీర్తి, త్రీ మ్యాన్ కమిటీ సభ్యులు బాబయ్య, మహేంద్ర, పట్టణ అధ్యక్షులు వడ్డే సూరి,మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, జనసేన పార్టీ నాయకులు రంగేపల్లి నాగరాజు,వరలక్ష్మి,పట్టణ ఉపాధ్యక్షులు ఆకుల రమణ, క్లస్టర్ ఇంచార్జ్ మద్దిలేటి, రమేష్ ,బూత్ కన్వీనర్ దేవాంగం సోమశేఖర్, ప్రకాష్, నాగరాజు,సూరి, నటరాజ్,శంకర, రామాంజినేయులు, రేషన్ డీలర్లు బాలు,పరంధామ, మురళి,లక్ష్మీ నారాయణ కాంట్రాక్టర్ రమణారెడ్డి,అధికారులు,ఎన్డీయే కూటమి కార్యకర్తలు గ్రామస్థులు మహిళలు,తదితరులు పాల్గొన్నారు

## బద్వేల్ 12వ వార్డు శివానగర్‌లో ఇంటింటికి తెలుగుదేశం

ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే ధ్యేయం: టీడీపీ ఇన్‌చార్జ్ సూర్యనారాయణ రెడ్డి..



**బద్వేల్, ఆగస్టు 06 సీమవార్త. సాయంత్రం** బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు శివానగర్‌లో ఈరోజు ‘ఇంటింటికి తెలుగుదేశం’ కార్యక్రమం నిర్వహించారు. బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్, నూతన రథసారథి మంజూరు సూర్యనారాయణ రెడ్డి ఈ పర్యటనలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన శివానగర్ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో నేరుగా మాట్లాడారు. వారి స్థానిక సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సూర్యనారాయణ రెడ్డి తక్షణమే స్పందించి, సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మంజూరు సూర్యనారాయణ రెడ్డి గారితో పాటు యువ నాయకులు కొంకుల రవి, తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి చెందిన పలువురు ముఖ్య నాయకులు, నియోజకవర్గ శ్రేణులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. కూటమి నాయకులంతా కలిసికట్టుగా ప్రజాక్షేత్రంలో పర్యటించి, ప్రజల పక్షాన నిలబడతామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో పది లక్షల మంది ఓటర్లు గల్లంతు!

-మొదటిపేజీ తరువాయి

వలస వచ్చిన ..ప్రస్తుతం వెళ్లిపోయి ఉంటారని అధికారులు భావిస్తున్నారు. ఓటరు ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు ఈ నెల పదో తేదీ వరకు గడువుండటంతో ఇందులో స్వల్ప మార్పులకు అవకాశం ఉంది. ఈ సంఖ్య ఇంకా పెరగవచ్చు లేదా తగ్గవచ్చు. వీరిలో మృతులు పోను మిగతావారిని అధికారులు ఆచూకీ తెలియని జాబితాలో చేర్చారు. వీరిలో అత్యధికంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 88,933 మంది ఉండగా, అత్యల్పంగా అంబర్‌పేట నియోజకవర్గంలో 38,208 మంది ఉన్నారు.

**డిజిటలైజేషన్ అంతంతే..**

అధికారులు ఎంతగా ప్రయత్నిస్తున్నా, ఇళ్లన్నీ తిరుగుతున్నా, రాజకీయ పార్టీలను అభ్యర్థిస్తున్నా, పార్టీల ఏజెంట్లను కోరుతున్నా ఎన్యూమరేషన్ ఫారాలు భర్తీ చేసి తిరిగి ఇచ్చిన వారు 27,26,655 మంది మాత్రమే. వీరి వివరాలు డిజిటలైజ్ చేశారు. ఇది 57.56 శాతం. మిగిలిన కొద్ది రోజుల్లో ఇంకెంతమంది ఫారాలు తిరిగి ఇస్తారో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఫారాల సమర్పణ గడువును ఇప్పటికే రెండు పర్యాయాలు పొడిగించడం తెలిసిందే. దీంతో, ఇవ్వాల్సిన వారి సంఖ్య స్వల్పంగా మాత్రమే ఉండే అవకాశం ఉంది. ఇక జిల్లాలోని ఓటర్లలో 4,91,236 మంది ఆన్‌లైన్ ద్వారా తమ ఎన్యూమరేషన్ ఫారా లు భర్తీచేశారు. వీరు 10.37 శాతంగా ఉన్నారు.

**94 భవనాల నుంచి పోలింగ్ కేంద్రాల మార్పు**

రాజకీయనేతల ఇళ్లు, మతపరమైన ప్రదేశాలు, ఇతరత్రా సున్నిత ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలు ఉండరాదన్న ఈసీఐ సెక్రటరీ ఆదేశాల నేపథ్యంలో 94 భవనాల్లోని పోలింగ్ కేంద్రాలను మార్చేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. ఈ మేరకు వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో వివరించారు. ‘నామెన్‌క్లేచర్’లు మార్చాల్సిన పోలింగ్ కేంద్రాలు 39 ఉన్నట్లు గుర్తించారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణలో భాగంగా ఓటర్ల సంఖ్య తక్కువగా ఉన్న 71 పోలింగ్ కేంద్రాలను ఇతర కేంద్రాల్లో విలీనం లేదా రద్దు చేసేందుకు ప్రతిపాదించారు. ఓటర్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కొత్తగా నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రమబద?ధకరణతో జిల్లాలో ప్రస్తుతం ఉన్న 4062 పోలింగ్ కేంద్రాల్లో 67 తగ్గి, 3995 పోలింగ్ కేంద్రాలు మిగలనున్నాయి.

## తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆర్డిఓ



**మడకశిర ఆగష్టు 6 సీమ వార్త సాయంత్రం.** నియోజకవర్గం గురువారం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ నాగ ప్రసన్నలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ చంద్రశేఖర్ తో రెవెన్యూ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో నాగ ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఆర్డీవో తెలిపారు. ఉన్న రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా రెవిన్యూ ఇన్స్పెక్టర్ గిరియప్ప, వీఆర్వోలు సిబ్బంది ఉన్నారు.

## కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు ప్రజలకు తెలియజేయడానికే డోర్ టు డోర్ కార్యక్రమం ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

మడకశిర ఆగస్టు 6 సీమ వార్త సాయంత్రం పట్టణంలోని ఎస్సీ కాలనీ 7 వ , 8 వ వార్డు లలో డోర్ టు డోర్ క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మడకశిర శాసనసభ్యులు, టి.టి.డి బోర్డు సభ్యులు శ్రీ ఎం.ఎస్. రాజు , మాజీ ఎమ్మెల్సీ శ్రీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకొని, ప్రభుత్వం అమలు



చేస్తున్న సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. స్థానిక ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై వారి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కుంచిటి వక్కలుగా రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, పట్టణ కన్వీనర్ నాగరాజు, రూరల్ కన్వీనర్ నాగరాజు స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాయితీ బియ్యం పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు



మడకశిర ఆగస్టు 6 సీమ వార్త సాయంత్రం నియోజకవర్గంలో నిర్వహించిన రాయితీ బియ్యం పంపిణీ కార్యక్రమంలో మడకశిర శాసనసభ్యులు, టి.టి.డి బోర్డు సభ్యులు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎం.ఎస్. రాజు , మాజీ ఎమ్మెల్సీ శ్రీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరకు అందించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద బిపిటి రకం బియ్యం మార్కెట్ ధర కిలోకు రూ 62 ఉండగా, ప్రజలకు కిలోకు రూ 52కే అందుబాటులోకి తీసుకువచ్చారు. అలాగే మరో రకం బిపిటి బియ్యం మార్కెట్ ధర ర58 ఉండగా, కిలోకు రూ 50కే అందిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన బియ్యం అందుబాటు ధరల్లో లభించడంతో వారి కుటుంబ వ్యయ భారం గణనీయంగా తగ్గనుంది. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, పట్టణ కన్వీనర్ నాగరాజు, రూరల్ కన్వీనర్ నాగరాజు, ఆర్డీవో నాగ ప్రసన్నలక్ష్మి, డిప్యూటీ తహసిల్దార్ లక్ష్మీనరసింహ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సోమశేఖర్ రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెల్ల రేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారు

-మొదటిపేజీ తరువాయి

ఆమోదించారని ఆయన తెలిపారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల మధ్య రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాల శాఖల సమన్వయంతో రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు) ఈ పంపిణీని పర్యవేక్షిస్తారు. లబ్ధిదారుల తుది జాబితాలను సిద్ధం చేసి, పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. నూతనంగా రూపకల్పన చేసిన ఈ రేషన్ కార్డులు లామినేషన్‌తో డెబిట్ కార్డు తరహాలో సౌకర్యవంతంగా ఉంటాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న కార్డుల్లా కాకుండా, వీటిపై కుటుంబ సభ్యుల ఫొటోలు, పేర్లకు బదులుగా ఒక విశిష్ట సంఖ్య, బార్‌కోడ్ మాత్రమే ఉంటాయి. ఈ బార్‌కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా లబ్ధిదారులకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో పొందవచ్చు. నూతనంగా అర్హత పొందిన కుటుంబాలకు సంపూర్ణ ఆహార భద్రత కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.

## వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

-మొదటిపేజీ తరువాయి

కోర్టులు చీవాట్లు పెడుతున్నా వారు బుద్ధి మార్చుకోవడం లేదు. హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్లపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. ఈనెల 13న సీడ్ యాక్సిస్ రహదారిని ప్రారంభిస్తాం. 250 మీటర్ల ఎత్తుతో దుబాయ్ ఐ వీల్ ప్రపంచంలో అతి ఎత్తైనదిగా ఉంది. దుబాయ్ ఐ వీల్ కంటే.. అమరావతి ఐ వీల్ పెద్దదిగా ఉండాలి” అని సీఎం చంద్రబాబు అన్నారు. రాజకీయం ముసుగులో మాజీ సీఎం జగన్ తీవ్ర నేరాలకు పాల్పడుతున్నారని, వైసీపీ నేతల అరాచకాలకు చెక్ పెట్టడానికి తమకు కేవలం రెండు నిమిషాలు చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఘాటుగా హెచ్చరించారు. అమరావతి సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ ప్రక్రియపై కోర్టు చివాట్లు పెట్టినా పట్టించుకోకుండా వైసీపీ శ్రేణులు కావాలనే వివాదాలు సృష్టిస్తూ రాద్ధాంతం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీ వ్యవహారంలో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని, తప్పుడు ఆరోపణలను క్షేత్రస్థాయిలో గట్టిగా తిప్పికొట్టాలని టీడీపీ నేతలు, శ్రేణులకు సీఎం సూచించారు. జగన్ ఎక్కడైనా పరామర్శలకు వస్తున్నారంటేనే అసలు ఏం జరుగుతుందోనని జనాలు భయపడే పరిస్థితి దాపురించిందని ఎద్దేవా చేశారు.

## పరామర్శల పేరుతో బలప్రదర్శన ఎందుకు?

-మొదటిపేజీ తరువాయి

నష్టపోయి మృతి చెందిన వ్యక్తి విగ్రహావిష్కరణకు జగన్ వెళ్లారు. ఆయన కారు కింద ఓ వ్యక్తి పడినా పట్టించుకోకుండా వెళ్లిపోయారు. అంబులెన్స్‌కు దారి ఇవ్వకుండా వైకాపా కార్యకర్తలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పరామర్శల సమయంలో మహిళలపై కూడా దాడులు జరుగుతున్నాయి. పోలీసులను బ్లాక్‌మెయిల్ చేసే ప్రయత్నాలు చేస్తున్నారు” అని ఆరోపించారు. పరామర్శల పేరుతో నిర్వహిస్తున్న బలప్రదర్శనల వల్ల ఇప్పటికే ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని అనిత అన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఒక్క మంచి పని అయినా జరిగిందా అని జగన్‌ను ప్రశ్నించారు.

## రైతుల కోసం కేంద్రం రూ.23,731 కోట్ల ‘గోబర్ధన్’ పథకం

వ్యవసాయ అవశేషాలు, పశువుల వ్యర్థాలతో అదనపు ఆదాయం పొందేలా రైతులకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక అవకాశం కల్పించింది. బయోగ్యాస్ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా రూ.23,731 కోట్ల వ్యయంతో ‘గోబర్ధన్’ జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకానికి కేంద్ర క్యాబినెట్ గురువారం ఆమోదం తెలిపింది. 2026-27 నుంచి 2035-36 వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. దేశీయంగా ‘కంప్రెస్డ్ బయోగ్యాస్’ (సీబీజీ) ఉత్పత్తిని దాదాపు పది రెట్లు పెంచడమే ప్రధాన లక్ష్యంగా కేంద్రం నిర్ణయించింది. రైతుల నుంచి సేకరించే పశువుల పేడ, వ్యవసాయ వ్యర్థాలకు డిమాండ్ పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా విస్తరించనున్నాయి. సీబీజీ ఉత్పత్తిదారులకు స్థిరమైన మార్కెట్ కల్పించేందుకు ప్రత్యేక కొనుగోలు విధానాన్ని కేంద్రం తీసుకొచ్చింది. అలాగే సీబీజీకి ప్రతి ఎంఎంబీటీయూకు రూ.2,110 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. దీనివల్ల ఉత్పత్తిదారులకు దీర్ఘకాలిక ఆదాయ భరోసా లభించనుంది. కొత్తగా ఏర్పాటు చేసే సీబీజీ ప్లాంట్లకు రోజుకు ఒక టన్ను ఉత్పత్తి సామర్థ్యానికి గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకు మూలధన సాయం అందించనున్నారు. ఇప్పటికే ఉన్న ప్లాంట్ల విస్తరణకు కూడా ఈ సాయం వర్తిస్తుంది. ముడి పదార్థాల సేకరణ, సేంద్రియ ఎరువుల తయారీ, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధికి కూడా ప్రోత్సాహం లభించనుంది. సీబీజీ ప్లాంట్లను గ్యాస్ పైప్‌లైన్లతో అనుసంధానించేందుకు అవసరమైన మౌలిక వసతులకు మద్దతు ఇవ్వనున్నారు. ఎంఎస్ఎంఈ ఆధారిత ప్రాజెక్టులకు రుణ హామీ పథకం కూడా అమలు చేయనున్నారు. దీంతో పెట్టుబడులు పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని కేంద్రం భావిస్తోంది.

## డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్..

భారత్ డేటా సెంటర్ రంగంలో వేగంగా దూసుకెళ్తోంది. ఇప్పటికే హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్ కేంద్రాల్లో ఒకటిగా నిలిచింది. విశాఖపట్నం భారీ స్థాయి కొత్త డేటా సెంటర్ ప్రాజెక్టులకు ఆకర్షణీయ గమ్యంగా మారుతోంది. ఈ విషయాలు నైట్ ఫ్రాంక్ విడుదల చేసిన తాజా నివేదికలో వెల్లడయ్యాయి. ప్రపంచంలోని 36 ప్రధాన డేటా సెంటర్ మార్కెట్లపై నిర్వహించిన అధ్యయనంలో ముంబయి ఆపరేషనల్ సామర్థ్యం పరంగా 15వ స్థానంలో నిలిచింది. అభివృద్ధి దశలో ఉన్న ప్రాజెక్టుల జాబితాలో 11వ స్థానాన్ని దక్కించుకుంది. హైదరాబాద్ ప్రస్తుతం 151 మెగావాట్ల సామర్థ్యంతో 27వ స్థానంలో ఉన్నా, 2.2 గిగావాట్లకు పైగా అభివృద్ధి ప్రణాళికలతో 19వ స్థానంలో నిలిచి వేగంగా విస్తరిస్తున్న కేంద్రంగా గుర్తింపు పొందింది. చెన్నై ఆగ్నేయాసియా ఇంటర్నెట్ ట్రాఫిక్‌కు కీలక కేంద్రంగా బలపడుతుండగా, బెంగళూరు గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, పరిశోధన సంస్థల పెట్టుబడులను ఆకర్షిస్తోంది. మరోవైపు పుణె, ఢిల్లీ ఎన్‌సీటీ ప్రాంతంలో కూడా డేటా సెంటర్ల సామర్థ్యం పెరుగుతోంది. రెండో శ్రేణి నగరాల్లో విశాఖపట్నం, జామ్‌నగర్ భారీ గ్రీన్‌ఫీల్డ్ డేటా సెంటర్ ప్రాజెక్టులకు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని నివేదిక పేర్కొంది. ప్రభుత్వ ప్రోత్సాహక విధానాలు, సముద్రగర్భ కేబుల్ కనెక్టివిటీ ప్రణాళికలు ఇందుకు దోహదపడుతున్నాయని వెల్లడించింది. క్లౌడ్ సేవల వినియోగం పెరగడం, కృత్రిమ మేధ వినియోగం విస్తరించడం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా ఎదగడం వల్ల భారత్‌లో డేటా సెంటర్లకు డిమాండ్ మరింత పెరుగుతోందని నైట్ ఫ్రాంక్ ఇండియా అభిప్రాయపడింది. విద్యుత్ సరఫరా, మౌలిక వసతుల విస్తరణ, వేగవంతమైన అనుమతులు ఉంటే రానున్న దశాబ్దంలో భారత్ ప్రపంచంలోనే కీలక డేటా సెంటర్ల కేంద్రంగా ఎదిగే అవకాశముందని పేర్కొంది.

## రేవంత్ రెడ్డి ఒక్కసారి కూడా ‘జై తెలంగాణ’ అనలేదు

సిద్దిపేటలో ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిద్దిపేట ప్రాంతంతో జయశంకర్ కు ప్రత్యేక అనుబంధం ఉండేదని గుర్తుచేసుకున్న ఆయన... కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ కల సాకారమైందని వ్యాఖ్యానించారు. నాడు ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని వ్యక్తి ఈరోజు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారని... రేవంత్ ఒక్కసారి కూడా ‘జై తెలంగాణ’ అని అనలేదని విమర్శించారు. గోదావరి నదీ జలాల హక్కుల పరిరక్షణలో కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమైందని హరీశ్ రావు ఆరోపించారు. కేసీఆర్ హయాంలో 380 టీఎంసీల నీటిని హక్కుగా సాధిస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఒక్క ప్రాజెక్టుకూ అనుమతి తీసుకురాకపోగా సాధించుకున్న అనుమతులను కూడా రద్దు చేసేలా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (+=వీదీ) అజెండా రూపొందుతోందని మండిపడ్డారు. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా అనుమతులు వచ్చిన ప్రాజెక్టులను పునఃసమీక్షించి రద్దు చేయాలనే అంశం అజెండాలోకి రావడం దుర్మార్గమన్నారు.

సీమ వార్త సాయంకాలం
గురువారం
6 ఆగస్టు 2026

# గోరంట్లలో... 300 మంది స్టూడెంట్స్‌కు సవితమ్మ డైరీలు




.....విద్యార్థుల విద్యా నైపుణ్యం కోసం.... మంత్రి సవితమ్మ డైలీల పంపిణీ.

....మంత్రి తన తండ్రి పేరిట స్థాపించిన... ఎస్ ఆర్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు.

....టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, జిల్లా కార్యదర్శి నరేష్ చేతుల మీదుగా పంపిణీ.

**గోరంట్ల ఆగస్టు 6 సీమ వార్త సాయంత్రం.**

వచ్చే ఏడాది పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి ఫలితాలు సాధించాలంటే విద్యార్థులు ముందస్తుగా మంచి జ్ఞానాన్ని సంపాదించుకోవాలని భావించిన మంత్రి సవితమ్మ సొంత ఖర్చులతో డైరీలను ముద్రించి విద్యార్థులందరికీ అందజేయడం ఆదర్శనీయం. పెనుగొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ హైస్కూలలో 9వ తరగతి మరియు 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్థానిక పార్టీ నాయకుల చేతుల మీదుగా డైరీలు పంపిణీ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం గోరంట్ల పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్లో 300 మంది విద్యార్థులకు టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, జిల్లా కార్యదర్శి నరేష్ చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. వారితోపాటు మండల టిడిపి నాయకులు నిమ్మల శ్రీధర్, మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి, గిరిధర్ గౌడ్, నాగే నాయక్, అజంతుల్లా, జయరాం, జనసేన మండల అధ్యక్షులు సంతోష్, జిల్లా కార్యదర్శి సురేష్, మార్కెట్ డైరెక్టర్లు దేవాంగం శ్రీనివాసులు, రామాంజనమ్మ, పసుపులేటి శ్రీనివాసులు, నాగమణి తదితరుల నేతృతంలో ఈ కార్యక్రమాల నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ హైస్కూల్లోని 300 మంది విద్యార్థులకు మంత్రి సవితమ్మ తన తండ్రి పేరిట స్థాపించిన ఎస్ ఆర్ ఆర్ చారిటబుల్ ట్రక్ పేరిట ముద్రించిన డైరీలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆగిశం నాగరాజు, సింగిల్ విండో డైరెక్టర్ నబీ రసూల్,వృషభ దేవుడు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చాంద్ బాషా, ఎస్వి నారాయణ, కురుబ మల్లికార్జున, కురుబ మహేంద్ర, సింగిరెడ్డిపల్లి శ్రీకాంత్, జనసేన డీలర్ పాగుతోట వెంకటేష్, వీర మహిళ కావేరి, చౌడేశ్వరి కాలనీ శ్రీనివాసులు, గోవిందప్ప, వాల్మీకి సోమశేఖర్, డీలర్ రమేష్, మల్లేష్, కసిరెడ్డిపల్లి శంకర తదితరులు పాల్గొన్నారు.

# చెప్పినవన్నీ చేసాం... ఇంటింటికి సంక్షేమాలు ఇచ్చాం.




గోరంట్లలోని నాల్గవ వార్డులో... టిడిపి డోర్ టు డోర్ కార్యక్రమాలు.

గడపగడపకు కరపత్రాలు... పథకాలు వివరిస్తూ ప్రజల మానవులు పొందుతూ ముందుకు.

టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం.

**గోరంట్ల ఆగస్టు 6 సీమ వార్త సాయంత్రం.** ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చమని సంక్షేమ పథకాలు ఇంటింటికి చేర్చమని అందుకే మీ ముందుకు వచ్చామని డోర్ టు డోర్ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు తెలుగు దేశం పార్టీ నాయకులు. గోరంట్ల పట్టణంలోని నాలుగవ వార్డు పరిధిలో టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా రెండేళ్ల పాలనపై పార్టీ ముద్రించిన కరపత్రలను ప్రజలకు పంచుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ పార్టీ శ్రేణులు ముందుకు సాగుతున్నారు. ఇంటింట ప్రచారంలో మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి తోపాటు పార్టీ జిల్లా కార్యదర్శి నరేష్, పార్టీ సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి, నిమ్మల శ్రీధర్, మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి, బిజెపి మండల అధ్యక్షులు బోయ లక్ష్మీనారాయణ, జనసేన మండల్ అధ్యక్షులు సంతోష్ కుమార్, జిల్లా కార్యదర్శి సురేష్, మల్లాపల్లి నరేష్ యాదవ్, నాగే నాయక్,గిరిధర్ గౌడ్, అజంతుల్లా, మేకల జయరాం, ఆగిశం నాగరాజు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దేవంగం శ్రీనివాసులు, చాంద్ బాషా లు పాలుపంచుకున్నారు.ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి మాట్లాడుతూ గోరంట్ల మండల వ్యాప్తంగా ఈ రెండేళ్ల కాలంలో మంత్రి సవితమ్మ చొరవతో అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయలు మంజూరు అయ్యాయని ఎన్నో గ్రామాలకు మొదటిసారిగా శాశ్వత రోడ్డు నిర్మాణాలు జరిగాయని ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమం సమపాళ్లలో జరుగుతు న్నాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ నబీ రసూల్,వృషభ దేవుడు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చాంద్ బాషా, ఎస్వి నారాయణ, కురుబ మల్లికార్జున, కురుబ మహేంద్ర, సింగిరెడ్డిపల్లి శ్రీకాంత్, జనసేన డీలర్ పాగుతోట వెంకటేష్, వీర మహిళ కావేరి, బిజెపి వెంకటాచలం, గంగంపల్లి సుబహన్, చౌడేశ్వరి కాలనీ శ్రీనివాసులు, గోవిందప్ప, వాల్మీకి సోమశేఖర్, డీలర్ రమేష్, మల్లేష్, బిజెపి శంకర, ప్రతాప్ చౌదరి, కసిరెడ్డిపల్లి శంకర, అమానుల్లా, ఎస్వి నారాయణ, సద్దాం, డీలర్ బొబ్బిలి రాము, డీలర్ పాగు తోట వెంకటేష్, మామిడికాయల హరి ప్రసాద్, చౌడేశ్వరి కాలనీ శ్రీనివాసులు, జనసేన గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అవకతవకలపై వైకాపా ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు




**మడకశిర ఆగస్టు 6 సీమ వార్త సాయంత్రం** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.యస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు డీఎస్సీ 2025 స్కాం పై సిబిఐ విచారణ చెయ్యాలని డీఎస్సీ లీకేజీ అక్రమాలకు బాధ్యత వహిస్తూ లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం పట్టణంలోని అమలాపురం బస్టాండ్ లోని ప్రభుత్వ వైద్యశాల ముందు భాగంలో రిలే నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు.

ఆగస్ట్ 6 నుంచి 9 వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలు కార్యక్రమం లో భాగంగా

గురువారం సమన్వయకర్త ఈరలక్కప్ప, ఆధ్వర్యంలో మొదటి రోజు రిలే నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టడం జరిగింది, ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వై సి.గోవర్ధన్ రెడ్డి, రాష్ట్ర వక్కలిగా విభాగ అధ్యక్షులు రంగేగౌడ్ ,

రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి రామ రెడ్డి రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యదర్శి నాగభూషణ రెడ్డి, మండల కన్వీనర్ కళ్ళుమరి శ్రీరాములు, పట్టణ కన్వీనర్ ఓంకుమార్,

రాష్ట్ర పంచాయతీ రాజ్ సంయుక్త కార్యదర్శి జయరామ్ యాదవ్,రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి నీలకంఠాపురం తిప్పేస్వామి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు నరసింహమూర్తి, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నరసింహ, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి రంగనాథ్, జిల్లా సోషల్ మీడియా ఉపాధ్యక్షులు నగేష్, జిల్లా యువజన విభాగం కార్యదర్శి లక్ష్మీనారాయణ, పట్టణ ఉపాధ్యక్షులు గోపి, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు ధను, పట్టణ పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు రఘునందన్, × పట్టణం మున్సిపల్ విభాగం అధ్యక్షులు హరీష్,పట్టణ యువజన విభాగం అధ్యక్షులు ఎస్ బాబు, తాలూకా బూత్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున, తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షులు శివన్న, మాజీ కౌన్సిలర్లు సిద్దప్ప, అన్సర్బాషా గారూ ,ఎం.ఎన్.స్వామి,మండల వివిధ కమిటీల అధ్యక్షులు నరసేగౌడ్, దివాకర్, విశ్వనాథ గౌడ, రవికుమార్, సికందర్,సుధాకర్, శివగంగప్ప, చాంద్ బాషా, నాగభూషణ్ రెడ్డి నరసింహులు నాగేంద్రప్ప, అరోన్ బాషా,మల్లేషప్ప సుదర్శన్, వద్రపాల్యశీ మంజునాథ్, లక్ష్మీనారాయణ గౌడ, నరసింహమూర్తి, కార్యదర్శులు, జిల్లా అనుబంధ విభాగం అధ్యక్షులు కార్యదర్శులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మండల కన్వీనర్లు,మండల అనుబంధ విభాగం అధ్యక్షులు, కార్యదర్శులు, పట్టణ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, మాజీ కౌన్సిలర్లు, మాజీ డీలర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు కార్యదర్శిలు,నియోజకవర్గంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, మరియు ప్రజలందరూ పెద్ద ఎత్తున ఈ రిలే నిరాహార దీక్షకు హాజరై నిరసనలు తెలియజేశారు.

## వీఆర్ఏ లకు ఇంటర్మీడియట్....విద్యా అర్హత కల్పించడంపై హర్షం.

....కృతజ్ఞతలు తెలియజేసిన వీఆర్ఏ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లిపోగు నాగేశం...

**బద్వేల్ ఆగస్టు 06 సీమవార్త.** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) లకు ఇంటర్మీడియట్ విద్య అర్హత తో గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్ఓ) పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తూ జీ.వో. ఎం.ఎస్. నెంబర్ : 480 ను విడుదల చేయటం జరిగిందని ఏపీ వీఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లిపోగు నాగేశం. ఈ సందర్భంగా రాష్ట్రప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో డిగ్రీ విద్యార్హత ప్రామాణికంగా వీఆర్ఓ పదోన్నతులు ఇచ్చారని ఈ కారణంగా కొంతమంది విఆర్ఏ లకు మాత్రమే లబ్ధి చేకూరుతుందని భావించిన విఆర్ఏ లు గౌరవ హైకోర్టు నందు రిట్ పిటిషన్ ద్వారా ఆశ్రయించడం జరిగిందని తదుపరి సుదీర్ఘ విచారణ అనంతరం ఇంటర్మీడియట్ విద్యా అర్హతతో విఆర్ఓ పదోన్నతులు ఇవ్వాలని అలాగే 5 సం,,లు లోపు డిగ్రీ పూర్తి చేసుకోవాలని నిబంధనలు విదించి గౌరవ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని ఆయన వివరించారు.

## ఆ ఊరి లో గ్రామ దేవత గా... రాయల వారి శాసనం'.

.....ఎర్రబల్లి లో శాసనన్ని గుర్తించిన....చరిత్రకారుడు మైనాస్వామి.




**గోరంట్ల ఆగస్టు 6: సీమ వార్త సాయంత్రం.** గోరంట్ల మండలం బూదిలి సమీపంలోని ఎర్రపల్లి గ్రామంలో రాయలవారి శాసనం గ్రామదేవతగా పూజలందు కొంటున్నదని చరిత్రకారుడు మైనాస్వామి చెప్పారు. గోరంట్లలో గురువారం నాడు విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎర్రపల్లి గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు గ్రామాన్ని సందర్శించిన మైనా స్వామి, అక్కడొక శిలా శాసనం గ్రామదేవత- 'బొడ్డెమ్మ' గా పూజలందుకోవడం చూసి ఆశ్చర్యపోయారు. వాస్తవానికి గ్రామ దేవత బొడ్డెమ్మకు ఎలాంటి రూపం లేదా విగ్రహం ఉండదు. కేవలం గుండ్రటి చిన్న రాయిని గ్రామం మధ్యలో ప్రతిష్టించి, రూపులేని రాయిని దేవతగా భావించి పూజించడం సంప్రదాయమని మైనాస్వామి వివరించారు. అయితే శాసనాన్ని చెక్కిన ఒక రాతి పలకను గ్రామ మధ్యలో నిలబెట్టి పూజించడం అరుదైన విషయం. నిజానికి ఆ రాతిపలక శాసనంలో పైభాగంలో తెలుగులో, కింది భాగంలో సంస్కృతంలో శాసనం ఉండడాన్ని చరిత్రకారుడు గుర్తించారు. శాసనం పైభాగంలో సూర్యుడు చంద్రుడు, రేఖ మాత్రంగా ఉన్న త్రిశూలం కనిపిస్తుండగా, శాసనంలోని అక్షరాలు రూపు చెదిరాయి. ద్విభాష శాసనం: ఈ రాతిపలకపై రెండు భాషల్లో అక్షరాలు చెక్కబడి ఉన్నాయి.పై భాగంలో తెలుగు, కింది భాగంలో సంస్కృత భాషలున్నాయి. కాలక్రమేణా వాతావరణ ప్రభావంవల్ల అక్షరాలు గణనీయంగా రూపు చెదిరినప్పటికీ, ఈ శాసనం విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల కాలానికి చెందిందని స్వామి అంచనా వేస్తున్నారు. శాసన నిర్మాణం, దానిపై ఉన్న చిహ్నాల ఆధారంగా ఇది ఒక దేవాలయానికి, సమూహానికి లేదా స్థానిక నాయకుడికి ఇచ్చిన 'దాన శాసనం' అయి ఉంటుందని భావిస్తున్నారు.గ్రామస్తుల సంరక్షణ: ప్రాచీన చరిత్రను తమ దైనందిన ఆధ్యాత్మిక జీవితంలో భాగం చేసు కొని, తరతరాలుగా అజ్ఞాతంగానే కాపాడు కొంటూ వస్తున్న గ్రామ పెద్దలను, ప్రజలను మైనాస్వామి అభినందించారు. ఈ క్షేత్ర పరిశీలనలో చరిత్రకారుని వెంట గ్రామ పెద్దలు వెంకటరెడ్డి, సోమశేఖర రెడ్డి, సురేంద్ర రెడ్డి తదితరులు పాల్గొని, స్థల చారిత్రక ప్రాధాన్యతను కాపాడుకోవడానికి మరింత పరిశోధన పట్ల ఆసక్తిని వ్యక్తం చేశారు.

## పది రోజులుగా హాస్టల్ కు రాని వార్డెన్... అర్ధాలతో విద్యార్థులు.

....గోరంట్ల బీసీ హాస్టల్ వార్డెన్ ఆంజినేయులును సస్పెండ్ చేయాలి.

....పి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, రాష్ట్ర సహాయ కార్యదర్శి చంద్ర.



**గోరంట్ల ఆగస్టు 6 సీమ వార్త సాయంత్రం.** గోరంట్ల ప్రభుత్వ వసతిగృహం వార్డెన్ ఆంజనేయులు ను వెంటనే సస్పెండ్ చేయాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర మరియు సహాయ కార్యదర్శి చంద్ర డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది రోజుల నుంచి హాస్టల్ వైపు కన్నెత్తి చూడకుండా పిల్లలను నిర్లక్ష్యంగా వదిలేసి ఏ మాత్రం సరుకులు ఇవ్వకుండా పిల్లలు అర్ధాకలి తో అల్లాడుతుంటే పట్టించుకోకుండా తన విధులు మరిచిపోయి అదేవిధంగా ఇతను ఇంచార్జ్ గా ఉన్న చిలమత్తూరు వసతి గృహంలో కూడా అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతూ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది మొన్న ఒక నాలుగు రోజులు గ్యాస్ కూడా లేదు పిల్లలకు కోడిగుడ్డు , అరటిపండు కూడా ఇవ్వలేదు. అధికారులకు ఎన్నిసార్లు తెలియపరిచిన నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వర్కరే హాస్టల్ ను నడపాల్సి వస్తోంది. ఇలా విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్ ను వెంటనే సస్పెండ్ చేయాలని , మరొక్క వార్డెన్ ను నియమించాలని డిమాండ్ చేశారు.

## జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్న విద్యార్థులకు ప్రోత్సాహం.

పట్టణ బాలుర హై స్కూల్ కు...రూ.15 వేల విలువైన క్రీడా సామగ్రి అందజేసిన స్వచ్ఛంద సంస్థ



**గోరంట్ల ఆగస్టు 6 సీమ వార్త సాయంత్రం.** జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, గోరంట్ల విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకువస్తున్న నేపథ్యంలో పి ఆర్ డి ఎస్ స్వచ్ఛంద సంస్థ పాఠశాలకు రూ.15,000 విలువైన క్రీడా సామగ్రిని అందజేసింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. ఈశ్వర ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీయడంలో స్వచ్ఛంద సంస్థల సహకారం ఎంతో విలువైనదని అన్నారు. పి ఆర్ డి ఎస్ సంస్థ అందించిన క్రీడా సామగ్రి విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందించడంలో ఉపయోగపడుతుందని తెలిపారు.పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పి ఆర్ డి ఎస్ సంస్థ ప్రభాకర్ రెడ్డి, ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కమళ్ళ భాష, అజీమ్ భాష , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881